జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి | సోమవారం 6 జూలై 2026 | సంపుటి : 16 | సంచిక : 280 | పేజీలు : 8 | వెల : 1/- | RNI NO.APTEL/2010/36516

శ్రీ పరాభవ నామ సంవత్సరం, జ్యేష్ఠ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం, విశేషం: మృగశిర కార్తె, సూర్యోదయం: 5:31 । సూర్యాస్తమయం: 6:33 చంద్రోదయం: 11:02 । చంద్రాస్తమయం: 10:38 తిథి: బహుళ షష్ఠి ఉ. 9:29 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: పూర్వాభాద్ర మ. 12:51 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర యోగం: సౌభాగ్యం మ. 1:30 వరకు, తదుపరి శోభ, కరణం: వణిజ ఉ. 9:29 వరకు, తదుపరి భద్ర రా. 9:06 వరకు, తదుపరి బవ

Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528



## క్యూర్ పరిధిలో

# మరో డాప్లర్ రాడార్

**హైదరాబాద్:**

భారత వాతావరణ శాఖ(ఐఎండీ) మరో అధునాతన డాప్లర్ వెదర్ రాడార్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనుంది. ప్రత్యేకించి 'క్యూర్' పరిధి కోసం వాతావరణ అంచనాలను మరింత కచ్చితంగా, వేగంగా ప్రజలకు అందించేందుకు ఎక్స్-బ్యాండ్ రాడార్ ఏర్పాటు చేయాలని నిర్ణయించగా.. అనువైన స్థల అన్వేషణలో అధికారులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయిస్తే అక్కడ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్లు ఐఎండీ అధికారులు తెలిపారు. ఇప్పుడున్న దానికి అదనంగా.. బేగంపేటలోని వాతావరణ కేంద్రంలో ఇప్పటికే ఒక డాప్లర్ రాడార్ 2010 సెప్టెంబరు నుంచి సేవలందిస్తోంది. ఇది ఎస్- బ్యాండ్ రాడార్. పరిధి చాలా విస్తృతం. 400 కిలోమీటర్ల పరిధి వరకు వాతావరణ పరిస్థితులను ఇది ట్రాక్ చేయగలదు. ఈ రాడార్ పాతది కావడంతో మరింత అధునాతన డాప్లర్ రాడార్ల ఏర్పాటుపై ఐఎండీ దృష్టి పెట్టింది. కొత్తగా ఏర్పాటు చేయబోయే ఎక్స్-బ్యాండ్ రాడార్ పరిధి 50 నుంచి 100 కి.మీ. వరకు ఉంటుంది. ఇప్పటికే ఉన్న రాడార్ సేవలు వినియోగించుకుంటూనే కొత్త రాడార్ సహాయంతో మరింత కచ్చితత్వంతో సిటీకి వాతావరణ సూచనలు చేయవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

**ప్రభుత్వం అర ఎకరం స్థలం కేటాయిస్తే...**

'ఈ రాడార్ ఏర్పాటుకు సిటీలో అర ఎకరం స్థలం కావాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాము. స్థలం కేటాయిస్తే కొత్త రాడార్ ఏర్పాటవుతుంది. ఈ ఎక్స్-బ్యాండ్ కొత్త రాడార్ వాతావరణ గమనానికి సంబంధించి అత్యంత వివరంగా, అధిక రెజల్యూషన్ కల్గిన డేటాని ఇస్తుంది'

## దశలవారీగా బాకారం జాగీర్ గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం



హెచ్ఎండీఏ నిధులతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

గ్రామస్థుల సహకారంతో సమస్యల పరిష్కారమే లక్ష్యం: సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్

## బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఆరోగ్య పరీక్షల శిబిరం

ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం -- భారీగా సిబ్బంది పాల్గొనడం






## రియల్ ఎస్టేట్ దందాల కోసమే ఫార్మా, ఫ్యూచర్ సిటీలు

ప్రభుత్వంపై ఫార్మా, ఫ్యూచర్ సిటీ బాధిత రైతుల ఆగ్రహం

ఈ ప్రాంత రైతుల పొట్ట కొట్టేందుకే ఏ ప్రభుత్వాలైనా

భూసేకరణ సమస్యలపై ప్రజా అభిప్రాయ సేకరణ

టిపి జేఏసీ ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ

రియల్ ఎస్టేట్ దందా కోసం భూములు గుంజుకుంటారా

# అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి: పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

## శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి మహోత్సవంలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు



**పరిగి, జూలై 05 (ప్రజాజ్యోతి):** పరిగి పట్టణంలోని అయ్యప్ప కాలనీలో గల శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో నిర్వహించిన శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (ఎస్ఐఆర్) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి తన సతీమణి ఉమా రామ్మోహన్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని,మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. దేవాలయాల పునర్నిర్మాణం, కొత్త దేవాలయాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించడం సమాజ బాధ్యత అని అన్నారు. ఆలయ వ్యవస్థాపకులు, శాశ్వత చైర్మన్ పాలాది శ్రీనివాస్ గుప్తా 19 సంవత్సరాలుగా నిలిచిపోయిన ఆలయ నిర్మాణ పనులను గత రెండు నెలలుగా రాత్రింబవళ్లు శ్రమించి పూర్తి చేయడంలో విశేష కృషి చేశారని ఎమ్మెల్యే ప్రశంసించారు. అలాగే ఆలయ నిర్మాణానికి సహకరించిన భక్తులు, దాతలు, కమిటీ సభ్యుల సేవలను అభినందించారు. అనంతరం ఆలయ వ్యవస్థాపకులు, శాశ్వత చైర్మన్ పాలాది శ్రీనివాస్ గుప్తా సహ ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే అయ్యప్ప స్వాములకు అన్నదానం వడ్డించి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాములు, భక్తులు,మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ నారాయణ విద్యా భవన్‌లో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం





**అల్వాల్ జూలై 5 ప్రజా జ్యోతి** అల్వాల్ గ్రీన్‌ఫీల్డ్స్ కాలనీలోని శ్రీ నారాయణ విద్యా భవన్‌లో ఆదివారం నిర్వహించిన ప్రతిష్ఠాపన కార్యక్రమంలో విద్యార్థులకు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి--తిరుమలగిరి ట్రాఫిక్ విభాగం సహాయ పోలీసు కమిషనర్ (ఏసీపీ) శ్రీ జి. శంకర్ రాజు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమాన్ని విద్యా సంస్థ అధ్యక్షుడు శ్రీ పి. బి. రవీంద్రనాథన్, ప్రధాన కార్యదర్శి, కరస్పాండెంట్ శ్రీ ఎం. పద్మనాభన్, విద్యా కార్యదర్శి శ్రీమతి రీనా విజయచంద్రన్, ప్రిన్సిపాల్ కె. వి. రాఘవచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ జి. శంకర్ రాజు మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ట్రాఫిక్ నిబంధనలను అలవర్చుకోవడంతో పాటు తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితుల్లో కూడా రహదారి భద్రతపై అవగాహన పెంచేలా కృషి చేయాలని సూచించారు. సమాజంలో ట్రాఫిక్ క్రమశిక్షణను పెంపొందించడంలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని ఆయన అన్నారు. ఏసీపీ అందించిన విలువైన సూచనలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. భవిష్యత్తులో కూడా రహదారి భద్రతపై ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు తమ వంతు కృషి కొనసాగుతుందని వెల్లడించింది.

# బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఆరోగ్య పరీక్షల శిబిరం

## ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం -- భారీగా సిబ్బంది పాల్గొనడం






**బోయిన్ పల్లి,జూలై 05. ప్రజా జ్యోతి::** మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పోలీస్ కమిషనర్ బి. సుమతి ఆదేశాల మేరకు, ట్రాఫిక్--1 డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె. రాహుల్ రెడ్డి చొరవతో ఆదివారం బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి ప్రత్యేక ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ప్రతిరోజూ రద్దీ రహదారులపై తీవ్ర ఎండ, వర్షం, కాలుష్యాన్ని ఎదుర్కొంటూ విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీసు సిబ్బంది ఆరోగ్యం, శారీరక దృఢత్వం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నివారణ ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించడం, ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తగిన వైద్య సేవలు అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్ రాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ట్రాఫిక్ పోలీసుల విధులు అత్యంత శ్రమతో కూడుకున్నవని, విధులను సమర్థవంతంగా నిర్వహించాలంటే ప్రతి పోలీసు అధికారి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ ఆరోగ్య శిబిరాన్ని రెటినోవా ఫౌండేషన్, శ్రీకర హాస్పిటల్, ప్లానెట్ ఆప్టిక్స్, పద్మ సాయి డెంటల్ క్లినిక్, స్పై ఫిట్ ఫిజియోథెరపీ సంయుక్తంగా నిర్వహించాయి. వైద్య బృందంలో డాక్టర్లు భవానీ, సాయి వంశీ, తిలక్, హరిత, ప్రవళికతో పాటు ఆప్టోమెట్రిస్ట్ భరత్ కుమార్ పాల్గొని పోలీసు సిబ్బందికి సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించారు.శిబిరంలో సాధారణ ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు, దంత పరీక్షలు, ఫిజియోథెరపీ సంప్రదింపులు, ఆరోగ్య సలహాలు అందించగా, పెద్ద సంఖ్యలో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొని సేవలను వినియోగించుకున్నారు.

ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్య పరిరక్షణకు సహకరించిన వైద్యులు, వైద్య నిపుణులు, సేవా సంస్థల ప్రతినిధులకు ట్రాఫిక్ పోలీసులు కృతజ్ఞతలు తెలియజేయడంతో కార్యక్రమం ముగిసింది.

# ఓటు హక్కును పరిరక్షించుకోవాలంటే ఓటరు చైతన్యం అవసరం: జంపన ప్రతాప్

**న్యూ బోయినపల్లిలో ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ.. జూలై 24లోపు పూర్తి చేసి బి ఎల్ ఓలకు అందజేయాలని సూచన**



**బోయిన్ పల్లి,జూలై05.(ప్రజా జ్యోతి):** రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పరిరక్షించుకోవడానికి ప్రతి ఓటరు చైతన్యవంతంగా వ్యవహరించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ అన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమంలో భాగంగా న్యూ బోయినపల్లి పెన్షన్ లైన్, నేతాజీ నగర్, కడక్‌పుర ప్రాంతాల్లో ఆదివారం బీఎల్వోలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్లకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్యూమరేషన్ ఫారాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తిగా నింపి, భారత ఎన్నికల సంఘం సూచించిన అవసరమైన రుజువు పత్రాలను జత చేసి జూలై 24లోపు సంబంధిత బి ఎల్ ఓ లకు అందజేయాలని ఓటర్లకు సూచించారు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడం ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎంతో కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బోర్డు ఎన్నికల అధికారి గుప్తా, బి ఎల్ ఓ మంజు, కాంగ్రెస్ నాయకులు మారుతి గౌడ్, సదానంద్, శరత్, ముకేశ్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జగద్గిరిగుట్టలో శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పాల్గొనడం



**కుత్బుల్లాపూర్ జూలై 5(ప్రజా జ్యోతి )** కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని సంజయ్ గాంధీనగర్‌లో నిర్వహించిన శ్రీశ్రీ పోచమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ అమ్మవారిని దర్శించుకున్నారు.. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, భక్తి భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శ్రీశైలం గౌడ్ శాలువ తో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు... ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ప్రవీణ్ గుప్తా మరియు సభ్యులు ప్రవీణ్ గౌడ్,అరుణ్ రెడ్డి, మల్లేష్ గౌడ్, రాములు, అరవింద్,సిద్ధులు, వాసు,శ్రీకాంత్ రెడ్డి,నరసింహ గౌడ్, వెంకటేష్, గణేష్, బాలు, అప్పల శీను,లక్ష్మణ్, శ్రీనివాస్, వెంకట్, భాగ్యలక్ష్మి మరియు స్థానిక నాయకులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు...

# శ్రీ పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలి: మన్నే రాజు



**కుత్బుల్లాపూర్ జూలై 5(ప్రజా జ్యోతి)** సాయిబాబా నగర్ డివిజన్ అపురూప కాలనీలో నిర్వహించిన శ్రీ పోచమ్మ తల్లి వార్షికోత్సవ మహోత్సవ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నే రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ మన్నే రాజు మాట్లాడుతూ, గ్రామ దేవతగా భక్తుల ఆరాధనలను అందుకుంటున్న శ్రీ పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సామరస్యం మరియు సాంప్రదాయ విలువలను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి , అపురూప కాలనీ ప్రెసిడెంట్ తిప్పారెడ్డి సీతారాం రెడ్డి , రామకృష్ణ , మోహన్ , వేణు రెడ్డి , కంచ కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లిప్‌కార్ట్ గోట్ సేల్‌లో ఏఐ ప్లస్ ఉత్పత్తులకు భారీ ఆఫర్లు



**హైదరాబాద్, జూలై 05 (ప్రజా జ్యోతి) :** ఫ్లిప్‌కార్ట్ గోట్ సేల్ సందర్భంగా ఏఐ ప్లస్ తన స్మార్ట్‌ఫోన్‌లు, ఏఐఓటీ ఉత్పత్తులపై ప్రత్యేక ధరలను ప్రకటించినట్లు ఏఐ ప్లస్ స్మార్ట్‌ఫోన్, ఎన్‌ఎక్స్‌టీక్యువాంటమ్ టెక్నాలజీస్ సీఈఓ మాధవ్ శేథ్ ఆదివారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫ్లిప్‌కార్ట్ ప్లస్ కస్టమర్లకు జూలై 3 నుంచే సేల్ యాక్సెస్ ఉండగా, జూలై 4 నుంచి అన్ని వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ సేల్‌లో ఏఐ ప్లస్ పల్స్ 2 స్మార్ట్‌ఫోన్‌ను రూ.8,999 ప్రత్యేక ధరకు అందిస్తున్నట్లు చెప్పారు. నోవా సిరీస్, వేరబుల్స్, ఆడియో ఉత్పత్తులు, టాబ్లెట్‌లపై కూడా ఆకర్షణీయమైన ఆఫర్లు ఉన్నాయని తెలిపారు. మరింత మంది వినియోగదారులు ఏఐ ప్లస్ ఎకోసిస్టమ్‌ను అనుభవించేలా ఈ ఆఫర్లు దోహద పడతాయని తెలిపారు.

## బీఆర్ఎస్‌లో చేరిన నేరేడ్మెట్ ఆర్కేపురం నాయకులు



**అల్వాల్ జూలై 5 ప్రజా జ్యోతి** నేరేడ్మెట్ ఆర్కేపురం ప్రాంతానికి చెందిన పలువురు నాయకులు, యువ కార్యకర్తలు ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో ఆయన క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారికి పార్టీ కండువా కప్పి ఘనంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బొబ్బిలి విజయ్ రెడ్డి, అశ్వత్ రెడ్డి, ధర్మేందర్, రాహుల్, సుశీల్, కార్తీక్ కుమార్, గౌరవ్, వేణు, అరవింద్, పరుస్మాళ్ జైన్, పింటో, హర్షిత్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల విశ్వాసం, పార్టీ నాయకులు, కార్యకర్తల అండదండలతో బీఆర్ఎస్ పార్టీ రోజురోజుకు మరింత బలోపేతం అవుతోందన్నారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మరింత మంది స్వచ్ఛందంగా పార్టీ కుటుంబంలో చేరడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జీకే హనుమంతరావు, జేపీసీ వెంకన్న, శివ గౌడ్, జేకే సాయి గౌడ్, దారా శ్రీనివాస్ రెడ్డి, చిందం శ్రీనివాస్, రవీందర్, సుమన్ గౌడ్, రాజు, అవినాష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## జులై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు జెనిగ శ్రీశైలం మాదిగ
సిద్దాపూర్ లో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ
ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీ అధ్యక్షుడిగా దొబ్బల రమేష్



**కొత్తూర్ జులై 05 (ప్రజా జ్యోతి)** జులై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు జెనిగ శ్రీశైలం మాదిగ అన్నారు. ఆదివారం కొత్తూరు మండలంలోని సిద్దాపూర్ లో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు జెనిగ శ్రీశైలం మాదిగ ఆధ్వర్యంలో సిద్దాపూర్ లో నూతన కమిటీ వేశారు. ఈ కమిటీ నూతన గ్రామ అధ్యక్షుడిగా దొబ్బల రమేష్, ఉపాధ్యక్షుడిగా గౌరి శ్రీను, అధికార ప్రతినిధి బైండ్ల చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి దొబ్బల విక్రం, కోశాధికారి మోడీ సత్యం, సహాయ కార్యదర్శి మోడీ మల్లేష్, సలహాదారులు ఎర్రోళ్ల శివకృష్ణ, దోబ్బల చిన్న మైసయ్య, కార్యవర్గ సభ్యులు దొబ్బల శివకుమార్, మోడీ నరసింహ, బైండ్ల మల్లేష్, మోడీ రేనయ్య, దుబ్బల కృష్ణ, మోడీ వెంకటయ్య, పట్నం సురేష్, దుబ్బల జనార్దన్, దుబ్బల వంశీ, దుబ్బల రవి, దొబ్బల ప్రవీణ్, మోడీ రమేష్ పట్నం రవి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జులై 7న జరిగే 32వ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలో అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున మాదిగ వాడలలో పండగ వాతావరణంలో జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. నూతన కార్యవర్గానికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులందరూ కార్మిక భీమా కార్డులు పొందాలి



**అబ్దుల్లాపూర్ మెట్టు జూలై 05(ప్రజాజ్యోతి)** అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులంత తప్పకుండ లేబర్ కార్డు తీసుకొని దాని ద్వారా కలిగే ప్రయోజనాలు పొందాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ అన్నారు. భవన నిర్మాణం కార్మిక సంఘం (బిఓసి) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి దాసరి ప్రసాద్ అధ్యక్షతన ఆదివారం నాడు రావి నారాయణ రెడ్డి కాలనీ ఫెజ్ 3 భూ పోరాట కేంద్రంలో జరిగిన లేబర్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి లు ముఖ్య అతిధులుగా హాజరై ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ బిఓసి ద్వారా 150 మందికి లేబర్ కార్డులు ఇప్పించి పంపిణీ చేయటం మంచి పరిణామమని అన్నారు. లేబర్ కార్డు వలన వచ్చే ప్రయోజనాల గురించి మెజారిటీ కార్మికులకు అవగాహనా లేక కార్డులు తీసుకోవట్లేరని అన్నారు. కార్మికులకు పని చేసే సమయాల్లో లేదా ఇతర వేరే చోట్ల ఎలాంటి ప్రమాదం జరిగిన కూడా వారికి, వారి కుటుంబ సభ్యులకి కొద్దీమేరకైనా రక్షణ ఉండాలంటే కార్మికులు తప్పకుండ లేబర్ కార్డు పొందాలని అన్నారు. లేబర్ కార్డు ఉండటం వలన కార్మికులకు కొంత మేరకు ప్రయోజనం జరుగుతుందని అన్నారు. గర్భిణీ స్త్రీలకి గర్భంతో ఉన్నప్పుడు డెలివరీ అయినా తరవాత కూడా ప్రభుత్వం నుండి కొద్దీ మేరకు ఆర్థిక సహకారం అందుతుందని అలాగే కార్మికుల పిల్లల చదువులకి కూడా సహకారం ఉంటుందని కార్మికునికి ఎలాంటి ప్రమాదం జరిగిన కూడా వైద్యం కొరకు సహాయం అందుతుందని అన్నారు. ఒకవేళ లేబర్ కార్డు ఉన్న కార్మికులు చనిపోయిన కూడా ప్రభుత్వం నుండి ఆ కుటుంబానికి ఆర్థిక సహకారం అందుతుందన్నారు. కావున అన్ని రంగాల్లో పని చేస్తున్న కార్మికులు ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా లేబర్ కార్డు పొందాలని దాని కొరకు దళారులని నమ్మి డబ్బులు వృధా చేయకుండా బిఓసి నాయకుల సహకారంతో లేబర్ కార్డులు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్, సహాయ కార్యదర్శి కేతారాజు నర్సింహా, బిఓసి మెట్టు మండల అధ్యక్షులు సాయిలు, నాయకులు సైదులు ముదిరాజ్ మరియు లేబర్ కార్డు పొందిన 150 మంది కార్మికులు పాల్గొన్నారు.

## సిద్ధాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేకంగా బీజేపీ ధర్నా

సీఎం, ఎమ్మెల్యే దిష్టిబొమ్మల దహనాన్ని అడ్డుకున్న పోలీసులు





**కొత్తూర్ జులై 05 (ప్రజా జ్యోతి)** సిద్ధాపూర్‌లో ప్రతిపాదిత డంపింగ్ యార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తూర్‌లో భారీ ధర్నా నిర్వహించారు. కొత్తూర్ మండల బీజేపీ అధ్యక్షుడు అత్తాపురం మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, మరియు బీజేపీ రంగారెడ్డి జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు మోహన్ సింగ్ నాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ధర్నా అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే వైఖరిని నిరసిస్తూ సీఎం, ఎమ్మెల్యే దిష్టిబొమ్మలను దహనం చేసేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రయత్నించారు. అయితే పోలీసులు జోక్యం చేసుకుని దిష్టిబొమ్మల దహన కార్యక్రమాన్ని అడ్డుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను కొనసాగించారు. ఈ సందర్భంగా పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం, పర్యావరణానికి తీవ్ర ముప్పు కలిగించే విధంగా సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డును ఏర్పాటు చేయడం సమంజసం కాదన్నారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను గౌరవించి ప్రభుత్వం వెంటనే డంపింగ్ యార్డు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు మోహన్ సింగ్ నాయక్, సీనియర్ నాయకులు ప్రతాప్ రెడ్డి, బావండ్ల మాణిక్యం, సుధాకర్ అప్ప, మండల ప్రధాన కార్యదర్శి వన్నం శ్రీనివాస్, జి. శ్రీధర్ ఆచారి, బీజేపీ షాద్‌నగర్ టౌన్ ఉపాధ్యక్షుడు అల్లం అనిల్ గౌడ్, పవన్ కుమార్ రెడ్డి, వన్నం జంగయ్య, కొండల ఆచారి, బి. నరసింహ, గోవర్ధన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, వన్నం యాదయ్య, వన్నం ప్రభాకర్, వన్నం రామ్, పాముల మురళి, మధు, బి. సురేష్, జి. శివ, బడుక శేఖర్, పిపల చిన్నా, జి. సత్యం, కే. నరేష్, బి. శివ, జి. మోహన్, నరేష్, వడ్డే మల్లేష్, గూని మహేష్, గూని నవీన్ తదితర నాయకులు, కార్యకర్తలు, స్థానిక గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ బస్తీబాట

. అంబేద్కర్ నగర్‌లో పర్యటించి సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే
. అధికారులతో సమన్వయం చేసి వెంటనే చర్యలకు ఆదేశాలు



**బోయిన్ పల్లి, జూలై 5 (ప్రజాజ్యోతి):** సమస్యలే లేని ఆదర్శ నియోజకవర్గంగా కంటోన్మెంట్‌ను తీర్చిదిద్దే లక్ష్యంతో ఎమ్మెల్యే శ్రీ గణేష్ చేపడుతున్న 'బస్తీబాట' కార్యక్రమం ప్రజల్లో విశేష ఆదరణ పొందుతోంది. ఇందులో భాగంగా ఆదివారం వార్డు--3 పరిధిలోని అంబేద్కర్ నగర్లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. బస్తీలోని గల్లీల్లో కాలినడకన తిరుగుతూ స్థానికులను ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్యం, విద్యుత్ తదితర సమస్యలపై ప్రజలు చేసిన వినతులను అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమన్వయం చేస్తూ, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడం, ప్రతి సమస్యను వేగంగా పరిష్కరించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తమ బస్తీకి స్వయంగా ఎమ్మెల్యే వచ్చి సమస్యలను తెలుసుకుని వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 500 డ్రోన్లతో ఎల్‌పీఎల్-2026 ప్రారంభోత్సవం




**హైదరాబాద్, జూలై 05 (ప్రజా జ్యోతి) :** శ్రీలంకలోని కొలంబో ఎస్ఎస్‌సీ స్టేడియంలో జరగనున్న లంకా ప్రీమియర్ లీగ్(ఎల్‌పీఎల్)-2026 ఆరో సీజన్ ప్రారంభోత్సవంలో 500 డ్రోన్లతో ప్రత్యేక డ్రోన్ షో నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ ఈవెంట్ హక్కుల సంస్థ ఐపీజీ గ్రూప్ వ్యవస్థాపకుడు, చైర్మన్ అనిల్ మోహన్ ఆదివారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎల్‌పీఎల్ డైరెక్టర్ సమంత దొడన్‌వెల తోకలసి ఆయన మాట్లాడుతూ ప్రపంచస్థాయి వినోదాన్ని అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మ్యాచ్‌ల టికెట్లు జూలై 1 నుంచి బుక్‌మైషోలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అభిమానులు జీవితాంతం గుర్తుంచుకునే అనుభూతిగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. 500 డ్రోన్ల ప్రదర్శనతో ప్రపంచస్థాయి క్రీడా వేడుకను అందించనున్నట్లు తెలిపారు. డ్రోన్ షోతో ప్రారంభ మ్యాచ్ మరింత చిరస్మరణీయంగా మారుతుందని, కుటుంబాలతో కలిసి అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

## దివ్యాంగ్ వేదన దీక్ష గోడపత్రికను ఆవిష్కరించిన పాండు యాదవ్



**అబ్దుల్లాపూర్ మెట్టు జూలై 05 (ప్రజాజ్యోతి)** వికలాంగుల ఉపాధికి ప్రత్యేక కమిషన్ వేసి సిఫారసులు తీసుకొని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోషల్ జస్టిస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన దివ్యాంగ్ వేదన దీక్ష కు సంబంధించిన గోడ పత్రికను తెలంగాణ ప్రతిభావంతుల వికలాంగుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి. పాండు యాదవ్ వారికి తన మద్దతును ప్రకటిస్తూ హయత్ నగర్ లోని అంబేద్కర్ విగ్రహం ముందు ఏర్పాటుచేసిన గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగు వేదన దీక్ష కార్యక్రమానికి భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వికలాంగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మహేష్, సురేందర్, పద్మ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# గత వారం రోజులుగా హెచ్ సి యూ కార్మికుల ధర్నా

### హెచ్.సి.యూ కాంట్రాక్ట్ కార్మికులకు అండగా బీజేపీ



**శేరిలింగంపల్లి, జూలై 05 (ప్రజాజ్యోతి):** లేబర్ కమిషనర్ హెచ్.సి.యు అధికారులతో మాట్లాడి కార్మికుల డిమాండ్ లను నెరవేర్చే విధంగా నెల రోజుల్లో చర్యలు తీసుకునేలా హామీ ...బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి,శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్.గత వారం రోజుల నుండి హెచ్.సి. యు కాంట్రాక్ కార్మికులు కాంట్రాక్టర్ వలన ఇబ్బందులు పడుతున్నామని ఉద్యోగ భద్రత,ఆరోగ్య బీమా,పనికి సమాన వేతనం,ప్రమాద భీమా,ఇలా పలు డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టగా చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి కేంద్ర కార్మిక శాఖ మంత్రి తో ఆదివారం లేబర్ కమిషనర్ ఈ సమస్యల పరిష్కారానికి రాగా వారితో కలిసి యూనివర్సిటీ అధికారులతో కార్మికుల సమస్యల పై చర్చించి కార్మికుల డిమాండ్ లను నెల రోజుల్లో నెరవేర్చే విధంగా చర్యలు తీసుకునేలా లేబర్ కమిషనర్ మరియు హెచ్.సి. యు అధికారులతో హామీ ఇప్పించిన ...బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్.సి. యు కార్మికుల గత 20 సంవత్సరాల నుండి ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారని వారికి అండగా వారి హక్కులను ,వారి చిన్న చిన్న డిమాండ్లను నెరవేర్చాల్సిన బాధ్యత ఉందని ,మూడు రోజుల క్రితం పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి కి తెలియజేయగా వారు వెంటనే కేంద్ర కార్మిక శాఖ మంత్రి తో మాట్లాడగా వారు సానుకూలంగా స్పందించి వారి సమస్యల పై చర్చించేందుకు ఈరోజు లేబర్ కమిషనర్ గారు రావడం జరిగిందని,కమిషనర్ తో యూనివర్సిటీ అధికారులతో కార్మికుల 12 డిమాండ్ల పై చర్చించడం జరిగిందని, వారు కూడా సానుకూలంగా స్పందిస్తూ కమిషనర్ సూచనల మేరకు ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా,ప్రమాద బీమా,పనికి సమాన వేతనం,ప్రతి 20 రోజులు పని చేసిన వారికి వేతనంతో కూడిన 1 రోజు సెలవు,కాంట్రాక్టర్ మరల దురుసుగా ప్రవర్తించకుండా హామీ,ఎవరైనా ప్రమాదవశాత్తూ ఒక వేళ చనిపోయినట్లతే వారి కుటుంబంలో వారికి ఉద్యోగం ఇలా అన్ని హామీలకు ఒప్పుకున్నారని, అలాగే కార్మికులందరూ కలిసి ఒక సొసైటీ ఏర్పాటు చేసుకున్నట్లయితే మీకే కాంట్రాక్ట్ వచ్చేలా ప్రయత్నిస్తామని భరోసా కల్పిస్తూ, నేను యూనివర్సిటీ దగ్గరలోనే ఉంటానని, మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు,ఈ కార్యక్రమంలో కమిషనర్ వికాస్ గారు, యూనివర్సిటీ అధికారులు, బీజేపీ మీడియా ప్యానలిస్ట్ మహేష్, లింగంపల్లి కంటేస్టెడ్ కార్పొరేటర్ ఎల్లేష్, సీనియర్ నాయకులు మహేష్ యాదవ్,శ్రీకాంత్, హెచ్.సి.యు జేఏసీ నాయకులు , ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులు

**హైదరాబాద్:**జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూహెచ్) -- హైదరాబాద్, రాయిట్లింగెన్ యూనివర్సిటీ నాలెడ్జ్ ఫౌండేషన్ -- జర్మనీ సంయుక్తంగా 2026 విద్యా సంవత్సరానికి ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ బ్యాచిలర్స్ అండ్ మాస్టర్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాయి. ఈ కోర్సులో చేరిన విద్యార్థులు మొదటి మూడు సంవత్సరాలు జేఎన్‌టీయూహెచ్‌లో, అనంతరం రెండు సంవత్సరాలు జర్మనీలోని రాయిట్లింగెన్ యూనివర్సిటీలో చదువుతారు. కోర్సు పూర్తయిన తర్వాత విద్యార్థులకు జేఎన్‌టీయూహెచ్ నుండి దీ.ఎవష్త్ర డిగ్రీతో పాటు రాయిట్లింగెన్ యూనివర్సిటీ, జర్మనీ నుండి వీ.ూఎ డిగ్రీ ప్రదానం చేయబడుతుంది.కోర్సు వ్యవధి: 5 సంవత్సరాలు (10 సెమిస్టర్లు) అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో ఇంటర్మీడియట్ ఫీూజ లేదా సమాన కోర్సు ఉత్తీర్ణత. సీట్ల కేటాయింపు: జీజుజు మీుఅఅ స్కోరు లేదా తెలంగాణ జూూాజజు ర్యాంకు ఆధారంగా ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 10-07-2026. కౌన్సెలింగ్ తేదీ: 15-07-2026. కౌన్సెలింగ్ వేదిక: జేఎన్‌టీయూహెచ్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, కూకట్‌పల్లి, హైదరాబాద్. మరిన్ని వివరాలకు: హ్ట్టజూం://ఎశీు.యత్‌బష్త్ర.ఖఎ.అఅ/ లేదా హెల్ప్‌డెస్క్ 9044115999, 9044117999 సంప్రదించవచ్చు.

# అర్హులైన ప్రతి ఒక్కరు ఓటర్ నమోదు చేసుకోవాలి

### ఓటు హక్కు అనేది ప్రతి ఒక్కరి హక్కు

### బి ఎల్ ఏ, సామాజిక కార్యకర్త పొన్నాల నాగరాజు



**కూకట్ పల్లి, జూలై 05 (ప్రజా జ్యోతి)** : ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలంటే అర్హులైన ప్రతి ఒక్కరు ఓటర్ నమోదు చేసుకోవాలని బి ఎల్ ఏ, సామాజిక కార్యకర్త పొన్నాల నాగరాజు అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం, వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలో ఆస్బెస్టాస్ కాలనీ లో బూతులు 638 ఉ 639 లలో జరుగుతున్న ఓటరు జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమంలో భాగంగా, డివిజన్ పరిధిలోని ఆస్బెస్టాస్ కాలనీ మహబూబ్ పాఠశాల సమీపంలో బి ఎల్ ఏ పొన్నాల నాగరాజు, బి ఎల్ ఓ లు అంజలి, కనకదుర్గ లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్త ఓటర్ల నుండి ఫారం-6 స్వీకరించి, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను వేగవంతం చేయాలని బి ఎల్ ఓ కి సూచించారు. అనంతరం పొన్నాల నాగరాజు మాట్లాడుతూ18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైన ఆయుధం అని అన్నారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించే బాధ్యత మనందరిపై ఉందని, ఎస్ ఆర్ ఐ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి" అని పిలుపునిచ్చారు. అడ్రస్ మార్పు, కరెక్షన్ల కోసం ప్రజలు ఫారం-6, 7, 8 లను తమకు అందజేయవచ్చని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలంటే ప్రతి అర్హులైన ఓటరు పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు కావడం ఎంతో ముఖ్యమని, ఈ బాధ్యతను ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో నిర్వర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు.

# ఇంటింటికీ ఎస్ఐఆర్.. కౌకూర్‌లో విస్తృత స్పందన



**అల్వాల్ జూలై 5 ప్రజా జ్యోతి** గత నెల నుంచి ప్రారంభమైన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ కార్యక్రమం కౌకూర్ గ్రామంలో నేటి వరకు విజయవంతంగా కొనసాగుతోంది. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఓటరు వివరాల నమోదు, ధృవీకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు, బీఆర్ఎస్ నాయకులు సమన్వయంతో పనిచేస్తున్నారు. గౌరవ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు, బీఆర్ఎస్ పార్టీ సూచనలతో కౌకూర్ గ్రామంలోని బూత్ నంబర్లు 1 నుంచి 8 వరకు ప్రతిరోజూ జీహెచ్ఎంసీ బీఎల్‌వోలు, బీఆర్ఎస్ బీఎల్ఏలు, పార్టీ నాయకులు కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందిస్తూ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఓటర్ల వివరాల నమోదు, ధృవీకరణ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సూచనలు, సహకారం అందిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రజల నుంచి కూడా ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, 189వ డివిజన్ కౌకూర్‌కు చెందిన బందారి లక్ష్మణ్ యాదవ్ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు నిరంతరం కృషి చేస్తున్నాయని, ఎస్ఐఆర్ కార్యక్రమం పూర్తయ్యే వరకు ఇదే స్ఫూర్తితో సేవలు కొనసాగిస్తామని తెలిపారు.అవసరమైతే దీనిని మరింత పత్రికా శైలిలో లేదా స్థానిక దినపత్రికలకు అనుగుణంగా కూడా మార్చగలను.

# 1969 ఉద్యమ కారుడు ఉప్పు సుధాకర్ ను పరామర్శించిన కృష్ణా యాదవ్



**శేరిలింగంపల్లి,జూలై 05 (ప్రజాజ్యోతి):** తెలంగాణ ఉద్యమ కారుడు ఉప్పు సుధాకర్ ను తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం బి కృష్ణా యాదవ్ పరామర్శించారు.అంబర్ పేటలో ఉంటున్న ఉద్యమ కారుడు ఉప్పు సుధాకర్ ను కృష్ణా యాదవ్ తో పాటు తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి అధ్యక్షుడు రూబీ స్టీవెన్ సన్, ప్రధాన కార్యదర్శి తెలంగాణ వెంకన్న, జహంగీర్, అమర్ నాథ్ తదితరులు ఆదివారం కలిసారు. రోడ్ ప్రమాదంలో గాయాల పాలైన ఉప్పు సుధాకర్ ను కలిసి మనోధైర్యాన్ని నింపారు.ఈ సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం బి కృష్ణా యాదవ్ మాట్లాడుతూ ఉప్పు సుధాకర్ తొలి మలి దశ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నారు అని గుర్తు చేశారు.అంతే కాకుండా ఎస్ బి ఐ విశ్రాంతి ఉద్యోగుల సంఘం జాతీయ సంయుక్త కార్యదర్శిగా కూడా కొనసాగుతున్నారు అని తెలిపారు. రాష్ట్ర సాధన కోసం రాజకీయాలకు అతీతంగా ఉద్యమంలో పాల్గొన్న ఉప్పు సుధాకర్ పట్ల కేకే కమిటీ మానవతా దృక్పథంతో స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# జర్నలిస్టుల రైల్వే పాసుల పునరుద్ధరణకు కృషి

### -హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ




**హైదరాబాద్, జూలై 05 (ప్రజా జ్యోతి) :** జర్నలిస్టులకు ఆరోగ్య బీమా, గృహ వసతి, పింఛన్, ప్రమాద బీమా వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆదివారం తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో టీజేఏ రాష్ట్ర అధ్యక్షుడు కే.వి.రమణారావు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అలాగే జర్నలిస్టుల రైల్వే రాయితీ పాసుల పునరుద్ధరణ అంశాన్ని మరోసారి కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. టీజేఏ రాష్ట్ర అధ్యక్షుడు కే.వి.రమణారావు మాట్లాడుతూ 12 ఏళ్ల పోరాట ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వం అక్రిడిటేషన్ కమిటీల్లో టీజేఏకు స్థానం కల్పించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజేఏ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ ఉప్పల లక్ష్మణ్, ఎన్‌యూజే(ఐ) జాతీయ ఉపాధ్యక్షుడు ఉక్కల్కర్ రాజేందర్ నాథ్, కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ నిజమొద్దీన్, టీడీపీ అధికార ప్రతినిధి డాక్టర్ ఏ.ఎస్.రావు, ఎన్‌యూజే(ఐ) కార్యవర్గ సభ్యుడు ధన్నారపు రాజలింగం, టీజేఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరీ, ఉపాధ్యక్షుడు ఖాసీం, కార్యదర్శి నాగస్వామి, కోశాధికారి ఖలీల్ అహ్మద్, మాజీ ఉపాధ్యక్షుడు చింతల నీలకంఠం పాల్గొన్నారు.

# దర్గాలో తాగునీటి కోసం బోరు ఏర్పాటు



**చేవెళ్ల జూలై 05(ప్రజా జ్యోతి):** చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు దేవుని ఎర్రవల్లి దర్గాలో భక్తుల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముస్లిం మైనార్టీ రోజా, దర్గా కమిటీ ఆధ్వర్యంలో బోరు ఏర్పాటు చేశారు. బోరు ఏర్పాటును మాజీ ఎంపీటీసీ ఎదిరే చంద్రయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దర్గాకు వచ్చే భక్తులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా బోరు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సామాజిక ఐక్యత, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. దర్గా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యం కోసం చేపట్టిన ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. స్థానికులు ఈ కార్యక్రమాన్ని స్వాగతించి కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కరికే మల్లేశం, ఎదిరే బక్కయ్య, హరిజన్ శివయ్య, ఎండీ జావీద్, గౌస్, ఫకీర్ సాబ్, ఎదిరే యాదయ్య, బస్తేపురం వెంకటయ్య, కంకంటి బాలయ్య, ఎర్రవల్లి మాణిక్యం రెడ్డి, ఎండీ నాసిబ్ ఖాన్, దర్గా కమిటీ సభ్యులు, ముస్లిం మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన

### మంత్రి వాకిటి శ్రీహరి,ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**కొత్తూర్ జూలై 05 (ప్రజా జ్యోతి)** కొత్తూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జే సుదర్శన్ గౌడ్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొని జే సుదర్శన్ గౌడ్‌ను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి జే సుదర్శన్ గౌడ్ చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న నాయకులకు కాంగ్రెస్‌లో తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. జే సుదర్శన్ గౌడ్ మరిన్ని విజయాలు సాధిస్తూ ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కొత్తూరు మండలం మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేరుతుంది



### కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్ రెడ్డి

### తీగాపూర్ లో లబ్ధిదారులు లత రవికి ప్రత్యేక శుభాకాంక్షలు

**కొత్తూర్ జూలై 05 (ప్రజా జ్యోతి)** ప్రజా ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేరుతుందని కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తూరు మండలంలోని తీగపూర్ గ్రామంలో ఇందిరమ్మ పథకం కింద నిర్మించిన ఇంటి గృహప్రవేశాన్ని కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్ రెడ్డి హాజరై ప్రారంభించారు.ఇంటి లబ్ధిదారులు లత రవికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ అమల నరేష్ గౌడ్,గోపన వోణి మల్లేష్ యాదవ్,శేఖర్,రాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బోయినపల్లిలో ఘనంగా ప్రారంభమైన రామ్‌రాజ్ కాటన్ 351వ షోరూమ్



**బోయిన్ పల్లి, జూలై 5 (ప్రజా జ్యోతి):** దేశవ్యాప్తంగా రిటైల్ విస్తరణలో భాగంగా ప్రముఖ వస్త్ర సంస్థ రామ్‌రాజ్ కాటన్ హైదరాబాద్‌లో తన 351వ నూతన షోరూమ్‌ను ఆదివారం బోయినపల్లి బాపూజీనగర్‌లోని చిన్నతోకట్ట విలేజ్, స్టార్ బజార్ ఎదురుగా ఘనంగా ప్రారంభించింది.ఈ కార్యక్రమానికి మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై భవన యజమానులు ఎల్. నారాయణ రెడ్డి, ఎల్. నీలాతో కలిసి షోరూమ్‌ను ప్రారంభించారు.అనంతరం మాజీ కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు కె. పాండు యాదవ్, ది కాస్మోస్ కో-ఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ ఆర్. మధుతో కలిసి దీపప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. షోరూమ్‌లో తొలి కొనుగోలును ఎల్. నారాయణ రెడ్డి, ఎల్. నీలా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, బోయినపల్లి ప్రాంత ప్రజలకు నాణ్యమైన సంప్రదాయ వస్త్రాలు ఒకే చోట అందుబాటులోకి రావడం ఆనందదాయకమని అన్నారు. ఈ షోరూమ్ స్థానిక వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.షోరూమ్‌లో బార్డర్ ధోతీలు, ముడతలు పడని ధోతీలు, సువాసన ధోతీలు, ఎంబ్రాయిడరీ ధోతీలు, పట్టు ధోతీలు, పంచకచ్చం ధోతీలు, కాటన్, లినెన్, డిజైనర్, పట్టు షర్టు, ధోతీ-షర్ట్ కాంబోలు, మహిళల కోసం కాటన్, పట్టు చీరలు, లెగ్గింగ్స్, అలాగే పురుషులు, మహిళలు, పిల్లల కోసం ఇన్నర్‌వేర్, తువ్వాళ్లు, రుమాళ్లు, సాక్స్ తదితర ఉత్పత్తులు అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు.రామ్‌రాజ్ కాటన్ వ్యవస్థాపకుడు, చైర్మన్ కె.ఆర్. నాగరాజన్ మాట్లాడుతూ, హైదరాబాద్ తమకు అత్యంత కీలకమైన మార్కెట్ అని, బోయినపల్లిలో ప్రత్యేక షోరూమ్ ఏర్పాటు ద్వారా సంప్రదాయ భారతీయ వస్త్రాలను మరింత మంది వినియోగదారులకు చేరువ చేస్తున్నామని తెలిపారు. నాణ్యత, ప్రామాణికత, సౌకర్యాన్ని సమన్వయం చేసిన ఉత్పత్తులను అందించడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా విస్తరణ కొనసాగుతూనే భారతీయ వస్త్ర వారసత్వాన్ని పరిరక్షించేందుకు సంస్థ కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.

# దళిత గిరిజన బస్తీల అభివృద్ధిలో ప్రభుత్వ వివక్ష

జిల్లా వ్యవసాయ కమిటీ అధ్యక్షుడు అంజయ్య
అభివృద్ధి, చేకూర్చని సంక్షేమ ఫలాలే ఇందుకు నిదర్శనం
బస్తీలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని డిమాండ్



**యాచారం, జూలై 05 (ప్రజాజ్యోతి):** దళిత గిరిజన బస్తీలను అభివృద్ధి చేయడంలో సంక్షేమ ఫలాల లబ్ధి చేకూర్చడంలో ప్రభుత్వం వివక్ష వహిస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మల్కీజుగూడా, బొల్లిగుట్టతండ నెల్కీపోచమ్మ తండాలలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సంక్షేమ ఫలాల, బస్తులు అభివృద్ధి చేయడంలో చిన్న చూపు చూస్తుందని అన్నారు. గ్రామాలలో వెనుకబడిన అభివృద్ధి, లబ్ధిదారులకు చేకూర్చని సంక్షేమ ఫలాలే ఇందుకు నిదర్శనం అన్నారు. గ్రామాల్లో అక్కడక్కడ ఇంకను కృష్ణ వాటర్ సరఫరా లేదని, అంతర్గత రోడ్లు లేవని, అర్హులందరికీ పింఛన్లు రావడంలేదని అర్హులకు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధి లేదన్నారు. 2001లో దళితులు ఇండ్ల స్థలాల కోసం ఎకరా భూమి కొనుగోలు చేశారని ఇప్పటికే ఆ భూములను రెడ్డి సామాజిక వర్గం ఇవ్వడం లేదన్నారు. దళిత గిరిజన గ్రామాలకు బస్తిలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## పోరాటాలతోనే పెండింగ్ ప్రాజెక్టులకు మోక్షం

గద్వాల : పాలకుల నిర్లక్ష్యం వల్ల ఏళ్ల తరబడిగా ముందుకు సాగని ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పెండిం గ్ ప్రాజెక్టులకు పోరాటాలతోనే మోక్షం లభిస్తుం దని పెండింగ్ ప్రాజెక్టుల సాధన పోరాట జేఏసీ కో ఆర్డినేటర్, న్యాయవాది మధుసూదన్ బాబు అన్నారు. ఇందుకోసం ఈనెల 19వ తేదీన మహ బూబ్‌నగర్ న్యూటౌన్‌లోని క్రౌన్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విస్తృత రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. రౌండ్ టేబుల్ సమావేశం బ్రోచర్లను ఆదివారం పట్టణంలోని టీజేఎస్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన మధుసూదన్ బాబు, నికర జలాల కేటాయింపు ఉన్న ఆర్డీఎస్, జూరాల వంటి ప్రాజెక్టు ద్వారా ఇ ప్పటికీ పూర్తిస్థాయిలో నీటి వినియోగం జరగక పోవడం పాలకుల వైఫల్యమేనన్నారు. వరద జలాల ఆధారంగా చేపట్టిన నెట్టెంపాడు, గట్టు, పాలమూరు-రంగారెడ్డి, నారాయణపేట- కొండగల్, చంద్రసాగర్-అమ్రాబాద్ ఎత్తిపోతల పథకా లకు సంబంధించి కాలువలు అందుబాటులో లే క నీరందుకునే పరిస్థితి లేదన్నారు.

## కన్నమేస్తూ.. ఉన్నది దోచేస్తూ..

**మెదక్ :** మెతుకుసీమలో అడపాదడపా చోరీలు జరుగుతూనే ఉన్నాయి. తాళం వేసిన ఇళు ,, వ్యాపార, వాణిజ్య దుకాణాలను దొంగలు లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఆభరణాలు, నగదు అందినకాడికి దోచుకుంటుండగా, పొలాల వద్ద నియంత్రికలను ధ్వంసం చేసి ఆయిల్ వంటివి ఎత్తుకెళ్తున్నారు. రాత్రి వేళ పోలీసులు గస్తీ చేపడుతున్నా వీటికి అడ్డుకట్ట పడటం లేదు.

**ముందుగా రెక్కీ చేపట్టి..**

దొంగలు ముందుగా తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రెక్కీ చేపడుతున్నారు. రాత్రివేళ లోపలికి చొరబడి ఏవి దొరికితే అవి చోరీ చేస్తున్నారు. ఇటీవల బంగారం ధర పెరగడం, వాటిని ఇళ్లలోనే భద్రపర్చడం, శుభకార్యక్రమాలకు వెళ్లి వచ్చిన వారు పడకగదిలో దాచిపెడుతుండగా, పసిగట్టి ఎత్తుకెళ్తున్నారు.

# వివేకానందుడికి ఘన నివాళు లర్పించిన కసిరెడ్డి భాస్కర్ రెడ్డి



**శేరిలింగంపల్లి,జూలై 05 (ప్రజాజ్యోతి):** భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి తెలియజేసిన వివేకానందుడికి మనం నివాళులు అర్పించడం మన అదృష్టంగా భావిద్దాం - కసిరెడ్డి భాస్కరరెడ్డి భారతదేశ గొప్పదనాన్ని విదేశాల్లో వినిపించి, దేశ ఖ్యాతిని ప్రపంచానికి తెలియజేసిన మహనీయుడు స్వామీ వివేకానంద వర్ధంతి నాడు ఆయనకు నివాళులు అర్పించడం మన అదృష్టంగా భావించాలని బిజెపి రాష్ట్ర నాయకులు,గౌతమీనగర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ముఖ్య సలహాదారుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు.వివేకానంద వర్ధంతి సందర్భంగా గౌతమీనగర్ కాలనీ మున్సిపల్ పార్కు వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన తదనంతరం ఆయన మాట్లాడుతూ... వివేకానందుడు చెప్పినట్టు దృఢమైన శారీరక దారుఢ్యంతో యువత ఉన్నప్పుడే దేశం దృఢంగా ఉంటుందని, యువత ఆయన మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో వివేకానంద ఆశయాలను అనుసరిస్తామని పెద్ద పెట్టున నినదించారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు అశోక్ కుమార్,మురళీధర్,దామోదర్ గౌడ్, నూకల లక్ష్మణ్,నర్సింహ,రామస్వామి, పాండురంగాచారి,రవీందర్ రెడ్డి,నాయర్, వినాయక్ రెడ్డి, తనవ్,కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# అప్పోజిగూడలో ఎస్ ఆర్ ఐ పై అవగాహన కార్యక్రమం

గ్రామస్థులకు స్వచ్ఛందంగా ఫారాలు నింపిన ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు
యువత సేవాభావం అభినందనీయం: కౌన్సిలర్ కల్లెంల జగపతి



**మొయినాబాద్ :జూలై 5( ప్రజా జ్యోతి)** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు అప్పోజిగూడలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ( ఎస్ ఐ ఆర్) కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కౌన్సిలర్ కల్లెంల జగపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు గ్రామస్థులకు స్వచ్ఛందంగా ఎస్ ఐ ఆర్ దరఖాస్తు ఫారాలను నింపి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలకు ఎస్ ఐ ఆర్ ప్రక్రియ, దరఖాస్తుల ప్రాముఖ్యత, వాటిని సక్రమంగా ఎలా నింపాలనే అంశాలపై వివరించారు. వృద్ధులు, నిరక్షరాస్యులు మరియు ఫారాలు నింపడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి యువకులు ప్రత్యక్షంగా సహాయం చేసి దరఖాస్తులు పూర్తి చేయించారు. దీంతో గ్రామస్థులు యువత సేవాభావాన్ని అభినందించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కల్లెంల జగపతి మాట్లాడుతూ, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల్లో యువత స్వచ్ఛందంగా పాల్గొనడం సంతోషకరమని అన్నారు. సమాజ సేవలో యువత ముందుండటం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రతి ఒక్కరికీ చేరవేయడంలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ యూత్ అధ్యక్షుడు తలుగుల వినీత్, నాయకులు శ్రవణ్, ఆల్వాల్ రెడ్డి, లక్ష్మణ్, జంగయ్య, కుమార్, సురేష్, రవీందర్, హరీష్, మాణిక్యం తదితరులు పాల్గొని గ్రామస్థులకు సహాయ సహకారాలు అందించారు. కార్యక్రమానికి గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై యువత సేవా కార్యక్రమాన్ని అభినందించారు,

# కొంతం సంగారెడ్డి జ్ఞాపకార్థం అన్నదాన సేవ

మాతృదేవో భవ ఆశ్రమంలో 150 మంది అనాథలకు భోజన వసతి



**మొయినాబాద్ : జూలై 5( ప్రజా జ్యోతి)** మొయినాబాద్ మండల పరిధిలోని బాకారం గ్రామానికి చెందిన 1వ వార్డు సభ్యుడు కొంతం నాగేశ్వర్ రెడ్డి తన తండ్రి కొంతం సంగారెడ్డి జ్ఞాపకార్థంగా మానవతా సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృదేవో భవ ఆశ్రమంలో సుమారు 150 మంది అనాథలు, వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి భోజనాలను అందించారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం సమాజానికి ఆదర్శమని పలువురు కొనియాడారు. ఆశ్రమంలోని నిర్వాహకులు, వృద్ధులు, అనాథలు కొంతం నాగేశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అవసరంలో ఉన్న వారికి అండగా నిలవడం గొప్ప సేవ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొంతం నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, తన తండ్రి కొంతం సంగారెడ్డి సేవా భావాన్ని ఆదర్శంగా తీసుకుని ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సమాజంలో ఆపన్నహస్తం అవసరమైన వారికి సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొని కొంతం సంగారెడ్డి సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమం ఆధ్యాత్మిక, సేవా భావాలతో సాగి అందరి ప్రశంసలు అందుకుంది.

# ఆల్ఫా మజిల్ క్లబ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎం బి కృష్ణ యాదవ్





**శేరిలింగంపల్లి, జూలై 05 (ప్రజాజ్యోతి):** బిర్లా ప్లానిటోరియం హాల్ లో జరిగిన ఆల్ఫా మజిల్ క్లబ్ ఆధ్వర్యంలో ముఖ్యాధితిగా హైదరాబాద్ టి జి ఓ'ఎస్ ప్రెసిడెంట్ ఎం బి.కృష్ణ యాదవ్ పాల్గోన్నారు పాల్గొని విజయత ఆయన బాడీ బిల్డర్లకు బహుమతులను అందజేశారు ఈ కార్యక్రమంలో ప్రముఖ క్రీడకరుడు సంజీవ్ యాదవ్,గుడిసె రూబీ స్టీవెన్ సన్,పిండిగా వెంకన్న,ఏఎంసి చైర్మన్ కళ్యాణ్,శివ ప్రసాద్ , విశాల్ నాయుడు,వెంకట్,నరేందర్ యాదవ్, విక్రమ్,సాయి యాదవ్,మహేష్,బీరెండర్,శివంత్ ,జగదీష్,తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలు భర్తీ చేయాలి

డివైఎఫ్ఐ మండల ప్రధాన కార్యదర్శి జంగయ్య
తక్షణమే ఉద్యోగ నోటిఫికేషన్లు వెలువరించాలి
జాబ్ క్యాలెండర్ ను ప్రకటించి అమలు చేయాలి
మండల కేంద్రంలో డివైఎఫ్ఐ మండల కమిటీ సమావేశం



**యాచారం, జులై 05 (ప్రజాజ్యోతి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయకుండా కాలయాపన చేస్తుందని డివైఎఫ్ఐ మండల ప్రధాన కార్యదర్శి ఆలంపల్లి జంగయ్య చెప్పారు. మండల కేంద్రంలో డివైఎఫ్ఐ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను సత్వరమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువత లక్షలు వెచ్చించి నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్న ఆశించిన మేరకు ఉద్యోగాల భర్తీ చేపట్టడం లేదన్నారు. హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాల్లో కేవలం 25 శాతం మాత్రమే భర్తీ చేశారని మిగతా 75 శాతం ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో మభ్యపెట్టి మాయ చేసి నేడు నిరుద్యోగుల్ని మోసం చేస్తుందని చెప్పారు. తక్షణమే కాలయాపన మని తక్షణమే ఉద్యోగ నోటిఫికేషన్లు వెలువరించాలని మరోవైపు జాబ్ క్యాలెండర్ ను ప్రకటించి అమలు చేయాలన్నారు. నాలుగేళ్లుగా పోలీసు రిక్రూట్మెంట్ లేకపోవడంతో అభ్యర్థులు కోచింగ్ సెంటర్స్ లో కోచింగ్ లు తీసుకుంటూ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నోటిఫికేషన్లు వేసి ఉద్యోగాలను భర్తీ చేయాలని లేని యెడల నిరుద్యుగులతో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# విద్యుత్ వైర్లు తెగి ఆవుల కొట్టంపై పడినా స్పందించని అధికారులు

అజీజ్‌నగర్‌లో ప్రమాదకర పరిస్థితి.. రైతుల ఆందోళన
తక్షణమే సమస్య పరిష్కరించాలని రైతు తూర్పు శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి



మొయినాబాద్ : జూలై 5( ప్రజా జ్యోతి) మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామ రెవెన్యూలో గల సర్వే నంబర్ 42లో ప్రమాదకర పరిస్థితి నెలకొంది. రైతు తూర్పు మల్లారెడ్డి పొలంలో ఉన్న విద్యుత్ వైర్లు తెగిపోయి ఆవులు ఉండే కొట్టంపై పడిపోయాయి. దీంతో పశువులు, రైతు కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నప్పటికీ సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటి వరకు స్పందించలేదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. తెగిపోయిన విద్యుత్ తీగలు కొట్టంపై ఉండటంతో పశు వులకు, అక్కడికి వెళ్లే రైతులకు ప్రాణాపాయం ఏర్పడే పరిస్థితి ఉందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు మరమ్మతు పనులు చేపట్టలేదని ఆరోపించారు. వర్షాకాలం కావడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశముందని, వెంటనే విద్యుత్ శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని తెగిపోయిన వైర్లను తొలగించి కొత్త వైర్లను ఏర్పాటు చేయాలని రైతు తూర్పు మల్లారెడ్డి కోరారు. ప్రమాదం జరిగే వరకు వేచి చూడకుండా ప్రజల ప్రాణాలు, పశువుల భద్రతను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. స్థానికులు కూడా విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

# దశలవారీగా బాకారం జాగీర్ గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం

**వాచ్ఎండీఏ నిధులతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం**

**గ్రామస్థుల సహకారంతో సమస్యల పరిష్కారమే లక్ష్యం: సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్**



**మొయినాబాద్ :జూలై 5( ప్రజా జ్యోతి)** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని బాకారం జాగీర్ గ్రామాన్ని దశలవారీగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్ తెలిపారు. ఆదివారం గ్రామపంచాయతీ పరిధిలో హెచ్ఎండీఏ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఉపసర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి, వార్డు సభ్యులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నామని అన్నారు. గ్రామంలో చాలా కాలంగా ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, గ్రామస్థుల సహకారం ఎంతో అవసరమని, అందరి భాగస్వామ్యంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ నిధులను పారదర్శకంగా వినియోగించి గ్రామ ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి,1 వ వార్డ్ సభ్యులు కొంతం నాగేశ్వర్ రెడ్డి,వార్డు సభ్యులు బండి అనిల్, ఉపేందర్ యాదవ్, కొండకల్ల రవి, మడి దినేశ్ రెడ్డి, బిక్షపతి గౌడ్, కొండకల్ల శ్రీకాంత్, కొండకల్ల మహేందర్‌తో పాటు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు,

# రియల్ ఎస్టేట్ దందాల కోసమే ఫార్మా, ఫ్యూచర్ సిటీలు

**ప్రభుత్వంపై ఫార్మా, ఫ్యూచర్ సిటీ బాధిత రైతుల ఆగ్రహం**

**ఈ ప్రాంత రైతుల పొట్ట కొట్టేందుకే ఏ ప్రభుత్వాలైనా**

**భూసేకరణ సమస్యలపై ప్రజా అభిప్రాయ సేకరణ**

**టిపి జేఏసీ ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ**

**రియల్ ఎస్టేట్ దందా కోసం భూములు గుంజుకుంటారా**

**మాకు ఫార్మా వద్దు ఫ్యూచర్ వద్దు భూములే కావాలి**

**సమస్యలు ప్రభుత్వానికి నివేదిస్తామన్నా టిపిజేఏసీ**





**యాచారం, జులై 5 (ప్రజాజ్యోతి):** రైతుల నుంచి తక్కువ ధరకు భూముల్ని విక్రయించి ఫార్మాసిటీ ఫ్యూచర్ సిటీ పేర్లతో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ దందా చేస్తుందని ప్రభుత్వాలు ఏవైనా ఈ ప్రాంత రైతుల పొట్ట కొట్టడానికే ఉన్నాయి తప్ప రైతులకు మేలు చేసే ప్రభుత్వమే లేదని రైతులు మండిపడ్డారు. ఫార్మాసిటీ భూ సేకరణ గ్రామాల్లో తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఫార్మా సిటీ – ఫ్యూచర్ సిటీ భూసేకరణ సమస్యలపై తాడిపర్తి లో ప్రజా అభిప్రాయ సేకరణ సభ నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నాలుగు గ్రామాల రైతులు ప్రజలు ప్రజాభిప్రాయ సేకరణ సభకు భారీగా తరలివచ్చారు. భూసేకరణ సమస్యలు రైతులంతా సభ దృష్టికి తీసుకువచ్చారు. భూములపై స్టే ఉన్నా.. అధికారుల కన్నా భిన్నంగా టీజీఐఐసి అధికారులు దౌర్జన్యపూరితంగా వ్యవహరిస్తున్నారని రైతులు మండిపడ్డారు. ఈ ప్రాంతంలో భూములు కోల్పోయి మరో ప్రాంతానికి రైతులు, కూలీలు పనుల కోసం వలస వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. నాలుగు గ్రామాల్లో దాదాపు 2 వేల ఎకరాలు ఈ భూములు కూడా కోల్పోతే రైతులు ఉపాధిని కోల్పోతారని ఉద్యమం చేస్తుంటే అధికారులు ఈ భూములపై ప్రభుత్వం జీవో తీసుకొచ్చిందని భూములు ఇయ్యాల్సిందేనని వేధిస్తున్నారని తమ ఆవేదనను వెలిబుచ్చారు. రైతుల భూములను ఆన్లైన్లో నమోదు చేసి రైతు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. . కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు ఫార్మాసిటీ జీవోను రద్దు చేయించాలన్నారు. ఈ ప్రాంత రైతుల ప్రజల భూసేకరణ సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు టిపి జెఎసి బృందం తెలిపింది. అభిప్రాయ సేకరణ సభలో సీనియర్ అడ్వకేట్ రఘునాథ్, మానవ హక్కుల వేదిక జాతీయ కమిటీ సభ్యులు జీవన్ కుమార్, సీనియర్ జర్నలిస్ట్ వసంత, ఇతర బృందంతో పాటు నాలుగు గ్రామాల సర్పంచులు, ఫార్మా ఉద్యమ సమన్వయకర్త కవుల సరస్వతి, ఫార్మా వ్యతిరేక కమిటీ సభ్యులు కానమోని గణేష్, సందీప్, కొండల్ రెడ్డి, సామ నిరంజన్, అచ్చి రెడ్డి, కుందారపు నారాయణ నాలుగు గ్రామాల రైతులు, కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యెన్కెపల్లి కరంచంద్ కుటుంబానికి తీరని లోటు

**నిబద్ధత కలిగిన కార్యకర్తను కోల్పోయిన బిఆర్ఎస్ పార్టీ**

**కుటుంబానికి రూ.1 లక్షల ఆర్థిక సాయం అందించిన బిఆర్ఎస్ నాయకులు**

**కరంచంద్ సేవలను స్మరించి ఘన నివాళులు**





**మొయినాబాద్ : జూలై 05 (ప్రజా జ్యోతి)** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని యెన్కెపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త కరంచంద్ మృతి పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కరంచంద్ కుటుంబానికి ఇది తీరని లోటని, అలాగే బిఆర్ఎస్ పార్టీ ఒక నిబద్ధత కలిగిన, చురుకైన కార్యకర్తను కోల్పోయిందని పేర్కొన్నారు. పార్టీ బలోపేతం కోసం కరంచంద్ ఎంతో కష్టపడి పనిచేశారని, ప్రతి కార్యక్రమంలో ముందుండి బాధ్యతలు నిర్వర్తించేవారని నాయకులు గుర్తు చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలోనూ, పార్టీ కార్యక్రమాల విజయవంతంలోనూ ఆయన చూపిన అంకితభావం అందరికీ ఆదర్శమని కొనియాడారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ కుటుంబ సభ్యులు కరంచంద్ కుటుంబానికి రూ.1 లక్షల ఆర్థిక సహాయం అందజేసి తమ అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, కరంచంద్ ఆశయాలను కొనసాగిస్తూ పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ఆయన సేవలు ఎప్పటికీ మరువలేనివని, ఆయన లేని లోటు పార్టీకి, గ్రామానికి ఎప్పటికీ తీరదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొని కరంచంద్‌కు భావోద్వేగపూర్వకంగా నివాళులర్పించారు.

## బిఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు చేయాలని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు పత్రం అందజేత:



**కోడంగల్ జులై 5 ప్రజా జ్యోతి న్యూస్ :** మా ప్రియతమ నాయకుడు తిరుపతి రెడ్డి మీద అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదు.... ఖబర్దార్ దీ=వా నాయకుల్లారా

ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రెడ్డి శీను మాట్లాడుతూ 20 ఏళ్ల ప్రజా జీవితంలో మచ్చలేని నాయకుడిగా తన ప్రస్తానని కొనసాగిస్తున్న శ్రీ ఏనుమల తిరుపతి రెడ్డి మీద మరియు కాడ స్పెషల్ ఆఫీసర్ వెంకటరెడ్డి మీద వేరుశనగ పల్లీల విషయంలో డబ్బులు తీసుకున్నారని నిరాధారమైన ఆరోపణలు చేసి వారి వ్యక్తిత్వాన్ని కించపరిచే విధంగా మాట్లాడిన టిఆర్ఎస్ నాయకుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు పత్రం అందించడం జరిగిందని చెప్పారు కార్యక్రమంలో దౌల్తాబాద్ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి , మాజీ ఎంపీటీసీ దస్తప్ప , మాజీ సర్పంచ్ నర్సింలు, షకీల్ మహమ్మద్ ,సాయిలు, శ్రీనివాస్, అశోక్ గౌడ్, రవితేజ , రవి కుమార్, బీమ్ రెడ్డి , భాస్కర్, ఉద్దపు రెడ్డి , అంజి గుండేపల్లి, వెంకటప్ప , ఆంజనేయులు ,రామ్ తదితరులు పాల్గొన్నారు

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి





**పరిగి, జూలై 05 (ప్రజాజ్యోతి):** పరిగి పట్టణంలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టి, సంకల్పంతో ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అన్ని సామాజిక వర్గాల ఒకేచోట విద్యను అందించాలనే లక్ష్యంతోప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ పాఠశాలను నిర్మిస్తుందని, విద్యతో పాటు ఆటలు , టెక్నాలజీని అందిపుచ్చుకునేలా వసతులు ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు. పరిగిలో నిర్మాణంలో ఉన్న ఈ పాఠశాల పనులను వేగంగా పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరంలోనే విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ పార్థసారథి పంతులు, మున్సిపల్ చైర్మన్ రంజిత వెంకటేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయూబ్, పిఏసిఎస్ వైస్ చైర్మన్ రాజపుల్లారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, పరిగి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్రాములు, కౌన్సిలర్ అఖిల, బాదం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల కోసం గంప జాతర నిర్వహించిన కొర్విచేడ్ గ్రామస్తులు

-వర్షాలు మంచిగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలి

-శ్రీ మల్లయ్య స్వామి ప్రత్యేక పూజలో పాల్గొన్న

-సర్పంచ్ యువ నాయకుడు పోలీస్ నవీన్ రెడ్డి








**బషీరాబాద్ జులై 05 ప్రజా జ్యోతి** వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం కొర్వి చేడ్ గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, యువకులు గ్రామస్తులు ఆధ్వర్యంలో ఆదివారం సాంప్రదాయబద్ధంగా గంప జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవాలయం శ్రీ మల్లయ్య స్వామి టెంపుల్ దగ్గరికి బ్యాండ్, డప్పులతో గ్రామ పెద్దలు యువకులు మహిళలు భారీ ఎత్తున ఊరేగింపుతో దేవాలయానికి చేరుకొని. శ్రీ మల్లయ్య స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకలు నిర్వహించి గ్రామానికి మంచి వర్షాలు కురవాలని ప్రార్థించారు. ఈ సందర్భంలో గ్రామ సర్పంచ్ యువ నాయకుడు పోలీసు నవీన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు అనుకూలంగా వర్షాలు కురిసిపంటలు సమృద్ధిగా పండాలని గ్రామ ప్రజలందరూ సుఖసంతోషులతో ఉండాలని ఆకాంక్షించారు. వచ్చిన భక్తులకు గ్రామ పెద్దలకు గ్రామస్తులకు యువకులకు మహిళలకు సర్పంచ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనిల్ కుమార్, వార్డ్ మెంబర్ వెంకటరెడ్డి సాయిరెడ్డి పరశు రాం రాజు శ్రీనివాస్ గ్రామస్తులు గ్రామ పెద్దలు రైతులు మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బిజినెస్

### హోండా కారుపై రూ.2.15 లక్షల డిస్కౌంట్!



జూలై 2026 నెలలో హోండా కార్స్ ఇండియా.. ఎంపిక చేసిన కొన్ని కార్లపై ఆకర్షణీయమైన డిస్కౌంట్లను, ప్రయోజనాలను ప్రకటించింది. ఇందులో నగదు తగ్గింపు, ఎక్స్‌చేంజ్ బోనస్, కార్పొరేట్ బెనిఫిట్స్ వంటి ప్రయోజనాలు ఉన్నాయి. అయితే ఈ ఆఫర్స్ కేవలం జూలై 31 వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయి. హోండా ఎలివేట్ కారుపై కంపెనీ గరిష్టంగా రూ.2.15 లక్షల డిస్కౌంట్ అందిస్తోంది. ఇందులో రూ. 40,000 వరకు నగదు తగ్గింపు, రూ. 30,000 వరకు ఎక్స్‌చేంజ్ ప్రయోజనం, కార్పొరేట్ ఆఫర్లు, లాయల్టీ ప్రయోజనాలు ఉన్నాయి. సాధారణంగా హోండా ఎలివేట్ ధరలు రూ. 11.60 లక్షల నుంచి రూ. 16.16 లక్షల మధ్య ఉన్నాయి. అయితే ఇది దేశీయ విఫణిలో హ్యుందాయ్ క్రెటా , కియా సెల్టోస్ , టాటా సియెర్రా, మారుతి విక్టోరిస్, మారుతి గ్రాండ్ విటారా, రెనాల్ట్ డస్టర్‌లకు ప్రత్యర్థిగా ఉంటుంది. సెడాన్ల విభాగంలో కొత్త హోండా అమేజ్ కొనుగోలుపై రూ. 67,000 వరకు ప్రయోజనాలు లభిస్తున్నాయి. హోండా అమేజ్ సెకండ్ జనరేషన్ మోడల్ మీద రూ. 58,000 వరకు డిస్కౌంట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే హోండా సిటీ ఫేస్‌లిఫ్ట్ కొనుగోలుపైన ఎలాంటి తగ్గింపులు లేదు. ఎందుకంటే ఈ కారు ఇటీవలే షోరూమ్‌లలోకి వచ్చింది. చీశీవ: కంపెనీ అందించే డిస్కౌంట్స్ లేదా ప్రయోజనాలు నగరాన్ని బట్టి మారుతూ ఉంటాయి. కాబట్టి కొనుగోలుదారులు మీరు కొనే కారుపై ఎంత డిస్కౌంట్ లభిస్తుంది అనే వివరాలను ఖచ్చితంగా తెలుసుకోవడానికి సమీపంలోని డీలర్షిప్ సందర్శించాలి.

### ఒక్కసారిగా రూ.60 వేలు..
### పెరిగిన విండ్సర్ ఈవీ ధర!

భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని.. ఎంజీ ఇండియా  తన విండ్సర్ ఈవీ ధరలను పెంచింది. జూలై 2026 నుంచి అమల్లోకి వచ్చిన ఈ ధరల పెంపు అన్ని వేరియంట్లకు వర్తిస్తుంది. ఉత్పత్తి వ్యయాలు పెరగడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ తెలిపింది. ఇటీవల కియా, టయోటా వంటి ఇతర వాహన తయారీ సంస్థలు కూడా తమ కార్ల ధరలను పెంచిన నేపథ్యంలో ఎంజీ కూడా ఇదే బాటలో నడిచింది. ఎంజీ విండ్సర్ ఈవీ మొత్తం ఐదు వేరియంట్లలో అందుబాటులో ఉంది. వీటిలో ఎక్స్‌సైట్ బేస్ వేరియంట్‌పై అత్యధికంగా రూ.60,000 పెంపు జరిగింది. దీంతో దీని ధర రూ.14.10 లక్షల నుంచి రూ.14.70 లక్షలకు చేరింది. ఎక్స్‌క్లూజివ్ వేరియంట్ ధర రూ.46,900 పెరిగి రూ.16 లక్షలకు చేరగా, ఎసెన్స్ వేరియంట్ కూడా అదే మొత్తంతో పెరిగి రూ.17 లక్షలకు చేరింది. ఎక్స్‌క్లూజివ్ ప్రో వేరియంట్ ధర రూ.52,000 పెరిగి రూ.17.90 లక్షలకు చేరుకుంది. టాప్ వేరియంట్ అయిన ఎసెన్స్ ప్రో ధర రూ.40,000 పెరిగి రూ.19 లక్షలుగా నిర్ణయించారు. మొత్తం మీద వేరియంట్‌లను బట్టి ధరల పెంపు 2.15 శాతం నుంచి 4.26 శాతం వరకు పెరిగిందని స్పష్టమవుతోంది. ధరల పెరుగుదల అమ్మకాలపై ప్రభావం చూపుతుందా?, లేదా? అనేది తెలియాల్సి ఉంది.

# అదానీ గ్రూప్ భారీ ఆసుపత్రి..
# 1,000 బెడ్లు పేదలకు ఉచితం

పారిశ్రామిక దిగ్గజం అదానీ గ్రూప్ ఆరోగ్య రంగంలో మరో భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా సమీపంలోని న్యూ టౌన్ ప్రాంతంలో 2,000 పడకల సామర్థ్యంతో ఒక అత్యాధునిక ఆసుపత్రిని ఏర్పాటు చేయనున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సువేందు అధికారి వెల్లడించారు. ఇందులో సగం పడకలను అంటే 1,000 బెడ్లను పేద రోగులకు పూర్తిగా ఉచితంగా కేటాయించనున్నట్లు ఆయన తెలిపారు. గత శనివారం తన నియోజకవర్గం భవానీపూర్‌లో పౌర సమాజ ప్రతినిధులతో జరిగిన ఒక సమావేశంలో సీఎం సువేందు అధికారి మాట్లాడారు. తమ ప్రభుత్వం గత రెండు నెలల్లో చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూ, అదానీ గ్రూప్ ఆసుపత్రి ఏర్పాటుకు లిఖితపూర్వక హామీ ఇచ్చిందని స్పష్టం చేశారు. ఈ ఆసుపత్రిలో 1,000 పడకలను పేదల ఉచిత వైద్యానికి, మిగిలిన 1,000 పడకలను వాణిజ్య కార్యకలాపాలకు వినియోగిస్తారని ఆయన వివరించారు. అదానీ గ్రూప్ సామాజిక బాధ్యతలో (సీఎస్ఆర్) భాగంగా దేశవ్యాప్తంగా ఆరోగ్య రంగంలో పలు కార్యక్రమాలు చేపడుతోంది. గతంలో బీహార్‌లో అఖండ జ్యోతి ఆసుపత్రితో కలిసి 'అదానీ సెంటర్ ఫర్ ఐ డిసీజెస్'ను ప్రారంభించింది. ఢిల్లీలోని లేడీ హార్డింగ్ మెడికల్ కాలేజీలో కిడ్నీ సంబంధిత వ్యాధుల చికిత్స ప్రాజెక్టును కూడా విస్తరించింది. ఈ సందర్భంగా అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ మాట్లాడుతూ.. "ఒక వ్యక్తికి కంటిచూపు ఇవ్వడమంటే కేవలం వైద్యం అందించడం కాదు, వారి జీవితంలోకి ఆశ, ఆత్మవిశ్వాసం, గౌరవాన్ని తిరిగి తీసుకురావడం" అని అన్నారు. కోల్‌కతాలో ఏర్పాటు చేయనున్న ఈ కొత్త ఆసుపత్రి, అదానీ గ్రూప్ ఆరోగ్య సేవల విస్తరణలో ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలవనుంది.




# బంగారు అభరణాలపై రుణం తీసుకుంటున్నారా?
# ఈ పొరపాట్లు అస్సలు చేయొద్దు!

ఇటీవల కాలంలో బంగారం ధరలు రికార్డు స్థాయిలో పెరిగినప్పటికీ ప్రస్తుతం ధరలు క్రమంగా దిగి వస్తున్నాయి. అయితే బంగారానికి ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. మహిళలకు ధరించేందుకు వాడుకోవడమే కాకుండా కష్ట సమయాల్లో ఎంతగానో ఆదుకుంటుంది. అత్యవసరంగా నగదు అవసరమైన వారు తమ బంగారు ఆభరణాలను అమ్మకుండా వాటిని తాకట్టు పెట్టి గోల్డ్ లోన్ తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం విద్య, వైద్యం, వ్యాపార అవసరాలు, వ్యవసాయ పెట్టుబడులు లేదా ఇతర అత్యవసర ఖర్చుల కోసం చాలామంది గోల్డ్ లోన్‌ను ఎంచుకుంటున్నారు. బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు కూడా తక్కువ సమయంలో రుణం మంజూరు చేయడం వల్ల ఈ రుణాలకు డిమాండ్ మరింత పెరుగుతోంది. నిపుణుల వివరాల ప్రకారం.. బంగారంపై రుణాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఇటీవల విడుదలైన ఎక్స్‌పీరియన్ నివేదిక ప్రకారం, భారతదేశంలో రిటైల్ రుణాల వృద్ధికి ప్రస్తుతం గోల్డ్ లోన్లు ప్రధాన కారణంగా మారాయి. 2023 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రిటైల్ రుణాల్లో గోల్డ్ లోన్ల వాటా 18 శాతంగా ఉండగా, 2026 నాటికి అది 41 శాతానికి చేరిందని నివేదిక చెబుతున్నాయి. గత ఐదేళ్లలో అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు దాదాపు 130 శాతం వరకు పెరగడం కూడా దీనికి ప్రధాన కారణంగా పేర్కొంది. బంగారం విలువ పెరగడంతో అదే ఆభరణాలపై రుణగ్రహీతలు మరింత ఎక్కువ మొత్తాన్ని పొందగలుగుతున్నా రు. ఇప్పుడు మీకు బంగారంపై ఎక్కువ రుణం లభించే అవకాశాల ఉన్నాయి. మీరు బ్యాంకుల్లో గానీ, ఇతర సంస్థల్లో గానీ బంగారంపై



రుణం పొందాలనుకుంటే గతంలో కంటే అధిక మొత్తంలో రుణం మంజూరు చేసే అవకాశం ఉంది. 2024 జనవరి-మార్చి త్రైమాసికంలో గోల్డ్ లోన్ల పంపిణీ విలువ రూ.483 కోట్లుగా ఉండగా, 2026 ఇదే కాలానికి అది రూ.981 కోట్లకు పెరిగింది. మీరు మొదటిసారి బంగా రంపై రుణం తీసుకుంటున్నట్లయితే ఈ పొరపాట్లు అస్సలు చేయవద్దని సూచిస్తున్నారు నిపుణులు. వారు చేసే సాధారణ తప్పుల్లో ఒకటి గరిష్టంగా ఎంత రుణం వస్తుందనే అంశానికే ప్రాధాన్యత ఇవ్వడం. కానీ రుణం తీసుకునేటప్పుడు మొత్తం ఖర్చును కూడా పరిశీలించడం చాలా ముఖ్యం.

# ఇంగ్లండ్ కల చెదిరింది
## ఏడో టీ20 వరల్డ్‌కప్‌తో మురిసిన ఆస్ట్రేలియా..!






మహిళల టీ20 ప్రపంచకప్ ఫైనల్లో అద్భుతం జరగలేదు. ఆరుసార్లు విజేత ఆస్ట్రేలియా జోరుకు తలొగ్గిన ఇంగ్లండ్ కప్‌ను అప్పగించింది. లార్డ్స్ మైదానంలో ఆల్‌రౌండ్ షోతో రెచ్చిపోయిన ఆసీస్ రికార్డు స్థాయిలో ఏడోసారి పొట్టి కప్‌ను ముద్దాడింది. ఆతిథ్య జట్టు నిర్దేశించిన 151 లక్ష్య ఛేదనలో బేత్ మూనీ(64), ఫొబో లిచ్‌ఫీల్డ్0(48) ఉతికేశారు. పవర్ ప్లేలోనే 62 కొట్టిన కంగారూ టీమ్.. 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. నాలుగోసారి పొట్టి కప్ ఫైనల్లో కంగుతిన్న ఇంగ్లండ్ సొంతగడ్డపై చెక్కుచెదరని రికార్డును చేజేతులా పోగొట్టుకుంది. ఐసీసీ ఈవెంట్లలో తామెంత ప్రమాదకరమో ఆస్ట్రేలియా మరోసారి చాటింది. ఫైనల్ వెళ్తే కప్ వదలేది లేదు అన్నట్టు ఆడే ఆసీస్.. ఏడోసారి టీ20 ప్రపంచకప్‌ను ఒడిసిపట్టింది. లీగ్ దశ నుంచి ఓటమెరుగని ఇంగ్లండ్‌ను సొంతగడ్డపై మట్టికరిపించిన కంగారూ టీమ్ తమ స్టయిల్లో విశ్వవిజేతగా నిలిచింది. ఆదివారం లార్డ్స్ మైదానంలో ఇంగ్లండ్‌ను బంతితో నిలువరించిన ఆస్ట్రేలియా బ్యాటతో రెచ్చిపోయింది. 151 పరుగుల మోస్తరు ఛేదనను ఆసీస్ దూకుడుగా మొదలెట్టింది. తొలి బంతినే బౌండరీకి పంపిన ఓపెనర్ జార్జియా వోల్(9)ను లారెన్ బెల్ బౌల్డ్ చేసి ఆదిలోనే బ్రేకిచ్చింది. కానీ, బిగ్ మ్యాచ్ ప్లేయర్ బేత్ మూనీ(64) ఒత్తిడికి లోనవ్వకుండా ఫొబే లిచ్‌ఫీల్డ్(48)తో కలిసి దంచేసింది. వీరిద్దరి ఉతుకుడుతో ఆసీస్ పవర్ ప్లేలో 62 పరుగులు చేసింది. శతక బాగస్ష?ృమ్యం నెలకొల్పిన లిచ్‌ఫీల్డ్‌ను డీన్ బౌల్డ్ చేసింది. కానీ, అప్పటికే ఆసీస్ విజయం వాకిట నిలిచింది. ఎలీసా పెర్రీ(13 నాటౌట్) జతగా లాంఛనం ముగించాలనుకున్న మూనీ ఎల్బీగా వెనుదిరిగింది. గార్డ్‌నర్(5 నాటౌట్) బౌండరీతో ఆసీస్ ఏడు వికెట్లతో విజయం సాధించింది.

### బ్రంట్ అర్ధ శతకంతో

టాస్ ఓడిన ఇంగ్లండ్‌కు ఫైనల్లో శుభారంభం దక్కలేదు. ఓపెనర్ అమీ జోన్స్(6)ను ల్యాసీ హామిల్టన్ ఔట్ చేయగా.. డేంజరస్ డాని వ్యాట్ హొడ్జ్(8) సైతం విఫలమైంది. టపటపా రెండు కీలక వికెట్లు పడిన వేళ.. కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్(58 నాటౌట్) బాధ్యతగా ఆడింది. ఒత్తిడిలోనూ ధనాధన్ ఆడిన అలలీసే క్యాప్సే(23) ఆసీస్ బౌలర్ల లయను దెబ్బతీసింది. అయితే.. గార్డ్‌నర్ వేసిన 9 ఓవర్లో క్యాప్సే 6, 4, 4 తో 16 రన్స్ పిండుకోగా స్కోర్ 60 దాటింది. అదే విధంగా ధాటిగా ఆడే క్రమంలో మొలినెక్స్ వేసిన బంతిని స్కూప్ చేయబోయి క్యాప్సే బౌల్డయ్యింది. ఆ షాక్ నుంచి తేరుకునేలోపే హీథర్ నైట్(2) వికెట్ల ముందు దొరికిపోయింది. అంతే.. ఇంగ్లండ్ కష్టాలు మళ్లీ మొదటికొచ్చాయి. చూస్తుండగానే నాలుగు వికెట్లు పడినా.. కెప్టెన్ బ్రంట్ పట్టువదల్లేదు. ఫ్రెయా కెంప్(44 నాటౌట్)తో కలిసి ఇన్నింగ్స్ నిర్మించింది. తొలుత సింగిల్స్, డబుల్స్ తీసిన కెంప్ కాస్త కుదురుకున్నాక బౌండరీలతో స్కోర్ వేగం పెంచింది. సథర్‌లాండ్ ఓవర్లో తను రెండు ఫోర్లు బాదగా స్కోర్ వందకు చేరింది. ధాటిగా ఆడి 37 బంతుల్లో హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పిందీ జంట. మొలినెక్స్ వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో కెంప్ స్ట్రెయిట్ సిక్సర్‌తో ఆతిథ్య జట్టు 4 నష్టానికి 150 పరుగులు చేయగలిగింది.

## స్పోర్ట్స్

### క్వార్టర్ ఫైనల్లో జకోవిచ్.. ఫెదరర్ ఆల్‌టైమ్ రికార్డు బద్ధలు..!




వింబుల్డన్‌లో నొవాక్ జకోవిచ్  జోరు చూపిస్తున్నాడు. పురుషుల సింగిల్స్‌లో అతడు క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టాడు. ఆదివారం హోరాహోరీగా జరిగిన ప్రీ-క్వార్టర్స్ పోరులో రోమన్ సఫీల్లిన్(రష్యా)ను చిత్తు చేశాడు. ఈ విక్టరీతో టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్(=శీస్త్రవతీ ఖీవసవతీవతీ) ఆల్‌టైమ్ రికార్డును బద్ధలు కొట్టాడు జకో. వింబుల్డన్‌లో 106వ విజయంతో ఫెదరర్‌ను అధిగమించాడీ సెర్బియా స్టార్. ఏడుసార్లు వింబుల్డన్ ఛాంపియన్ జకోవిచ్ ఈసారి చెలరేగిపోతున్నాడు. 25వ గ్రాండ్‌స్లామ్‌పై గురి పెట్టిన జకో.. పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్స్ చేరుకున్నాడు. రోమన్ సఫీల్లిన్(రష్యా) నుంచి గట్టి పోటీ ఎదురైనా చివరకు.. 7-6(6), 6-3, 3-6, 6-3తో గెలుపొందిన అతడు ఫెదరర్ పేరిట ఉన్న అత్యధిక విజయాల(105) రికార్డును తన వశం చేసుకున్నాడు. ఆదివారం సెంటర్ కోర్టులో రోమన్‌ను ఓడించడం ద్వారా ఈ మాజీ విజేత ఈ గ్రాస్ కోర్టు టోర్నీలో 106వ విజయం నమోదు చేశాడు. ఓపెన్ ఎరాలో ఆల్ ఇంగ్లండ్ క్లబ్‌లో ఇన్నేసి విక్టరీలు సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు.



## 'అయ్యగారే నెం.1' నినాదంపై అఖిల్ స్పందన.. నాకు నంబర్ వన్ కావాలనే లక్ష్యం లేదంటూ కామెంట్

అక్కినేని అఖిల్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'లెనిన్' విడుదలకు సిద్ధమవుతోంది. జూలై 10న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా అఖిల్ వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ తన సినీ ప్రయాణం, అభిమానులతో ఉన్న అనుబంధం, కెరీర్‌పై తన ఆలోచనలను పంచుకుంటున్నారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో "అయ్యగారే నెం.1" అనే నినాదంపై ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో "అయ్యగారే నెం.1c అంటూ వైరల్ అయిన అభిమాని గురించి మాట్లాడుతూ అఖిల్ ఆనందం వ్యక్తం చేశారు. ఒక అభిమాని తనపై చూపించిన ప్రేమ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఎక్కడికి వెళ్లినా అందరూ 'అయ్యగారు... అయ్యగారు' అని పిలుస్తున్నారు. ఈ పేరు నాకు అభిమానులు ఇచ్చిన ప్రేమకు నిదర్శనం. నాన్న నాగార్జునకు 'కింగ్' అనే ప్రత్యేక గుర్తింపు ఉన్నట్లే, నాకు 'అయ్యగారు' అనే పేరు సహజంగానే వచ్చేసింది. ఇది నాకు ఎంతో ప్రత్యేకమైన గుర్తింపు" అని అఖిల్ చెప్పారు. అభిమానులు తరచూ "అయ్యగారే నెం.1c అని అనడం గురించి స్పందిస్తూ అఖిల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిజం చెప్పాలంటే 'నంబర్ వన్' కావాలనే లక్ష్యం నాకు లేదు. నంబర్ వన్ అనేది ప్రతి ఒక్కరి అభిప్రాయం మీద ఆధారపడి ఉంటుంది. ఒకరికి నంబర్ వన్ అనిపించే వ్యక్తి, మరొకరికి కాకపోవచ్చు. అందుకే ఆ పోలికల గురించి నేను ఎక్కువగా ఆలోచించను" అని స్పష్టం చేశారు. తనపై అభిమానులు చూపిస్తున్న ప్రేమ తనకు మరింత బాధ్యతను పెంచుతుందని అఖిల్ అన్నారు. అభిమానులు నాపై ఇంత ప్రేమ చూపిస్తున్నప్పుడు, వారి అంచనాలను అందుకోవాలనే బాధ్యత కూడా నాపై ఉంటుంది. వారి ప్రేమ, ఉత్సాహం నాకు మరింత కష్టపడేలా ప్రేరణ ఇస్తాయి. వారిని ఎప్పుడూ నిరాశపరచకూడదనేదే నా ప్రయత్నం అని చెప్పారు. తెలుగు సినీ అభిమానుల్లో కొన్ని ప్రత్యేక నినాదాలు చిరస్థాయిగా నిలిచిపోయాయని చెబుతూ, "జై బాలయ్య" తరహాలో "అయ్యగారే నెం.1" కూడా తనతో ఎప్పటికీ ముడిపడి ఉండిపోతుందని అఖిల్ ఆనందం వ్యక్తం చేశారు. ఇంటర్వ్యూలో తన గత చిత్రాలైన 'హలో', 'మిస్టర్ మజ్ను', 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' గురించి కూడా అఖిల్ మాట్లాడారు. ఆ సినిమాల్లో తాను పోషించిన పాత్రలు మహిళలను గౌర వించే యువకులుగా ఉండటం తనకు ఎంతో నచ్చిందన్నారు. ముఖ్యంగా 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' చిత్రంలోని హర్ష పాత్ర గురించి మాట్లాడుతూ, ఆ పాత్రలో ఉన్న విలువలు ప్రతి అమ్మాయి కోరుకునే లక్షణాలు. అలాంటి పాత్ర చేయడం నాకు ఎంతో సంతృప్తినిచ్చింది అని తెలిపారు.



## ఓఆర్ఆర్ వద్ద పది ఎకరాలు కొనొచ్చు

సత్యదేవ్ హీరోగా వచ్చిన లేటేస్ట్ మూవీ రావు బహదూర్. ఈ నెల 3న థియేటర్లలో రిలీజైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద సక్సెస్ టాక్‌తో దూసుకెళ్తోంది. ఈ చిత్రంలో సత్యదేవ్‌కు జంటగా దీపా థామస్ హీరోయిన్‌గా మెప్పించింది. ఈ మూవీకి కేరాఫ్ కంచరపాలెం ఫేమ్ వెంకటేష్ మహా దర్శకత్వం వహించారు. మహేశ్ బాబు--నమ్రతా శిరోద్కర్ జీఎంబీ ఎంటర్‌టైన్ మెంట్ సమర్పణలో ఏ ప్లస్ ఎస్ మూవీస్, శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్ మెంట్స్ బ్యానర్స్ చింతా గోపాలకృష్ణా రెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర నిర్మించారు. ఈనెల 3న థియేటర్లలో రిలీజైన ఈ ?సినిమాకు తొలిరోజు నుంచే పాజిటివ్ టాక్ తెచ్చుకుంటోంది. హిట్ టాక్ రావడంతో జనాలు థియేటర్లకు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలోనే మూవీ టీమ్ హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ ఈవెంట్‌కు హాజరైన సత్యదేవ్ తన సినిమాల గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. గతంలో తన మూవీస్ చాలా నిరాశ పరిచాయని అన్నారు. రావు బహదూర్ లాంటి గొప్ప సినిమాను చూస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. సత్యదేవ్ మాట్లాడుతూ..' గతంలో నా సినిమాలు వచ్చినప్పుడు .. ఇది వర్కవుట్ అవుతుందని చెప్పేవారు. అంతేకాదు ఈ మూవీ హిట్ అయితే మీరు ఓఆర్ఆర్ వద్ద ఓ పది ఎకరాలు కొనొచ్చు అనేవారు. నాకు డిసప్పాయింట్‌మెంట్ అనేది కొత్త కాదు. దాంతో నేను, మహా సహజీవనం చేస్తుంటాం. సక్సెస్ అనేది కొత్త. ఈ రోజు సక్సెస్ వచ్చింది అనే పాయింట్ కంటే.. ఈ సినిమా జనాలు చూడకపోతే ఒక గొప్ప చిత్రాన్ని కోల్పోతారనే ఫీలింగ్ వచ్చింది. ఈ మూవీ జనాలు చూస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది' అని అన్నారు.






## 'ఫౌజీ' విజువల్స్ చూసి మైండ్ బ్లాక్ అయింది..

### ప్రభాస్ సినిమాపై నాగవంశీ షాకింగ్ కామెంట్స్!

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, 'సీతారామం' ఫేమ్ దర్శకుడు హను రాఘవపూడి కాంబినేషన్‌లో రాబోతున్న హిస్టారికల్ పీరియడ్ వార్ అండ్ లవ్ డ్రామా 'ఫౌజీ'పై రోజురోజుకూ అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. హను రాఘవపూడి కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో మైత్రి మూవీ మేకర్స్ సంస్థ ఈ పాన్-ఇండియా విజువల్ వండర్‌ను నిర్మిస్తోంది. వచ్చే వింటర్ కానుకగా, డిసెంబర్ 2026లో ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే, తాజాగా ఈ సినిమాకు సంబంధించి ప్రముఖ నిర్మాత సూర్యదేవర నాగవంశీ పంచుకున్న ఒక క్రేజీ అప్‌డేట్ ప్రభాస్ ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పిస్తోంది. ఒక ఇంటర్వ్యూలో నాగవంశీ మాట్లాడుతూ.. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత రవిశంకర్ తనకు 'ఫౌజీ' సినిమాకు సంబంధించిన కొన్ని రషెస్ చూపించారని, అవి చూశాక తనకు మైండ్ బ్లాక్ అయిందని నాగవంశీ పేర్కొన్నారు. చిత్ర యూనిట్ ఈ సినిమాను మనం ఊహించని రేంజ్‌లో, ఒక సరికొత్త హాలీవుడ్ లెవెల్‌లో తెరకెక్కిస్తోందని ఆయన ప్రశంసల వర్షం కురిపించారు. నాగవంశీ చేసిన ఈ ట్వీట్ సోషల్ మీడియాలో నిమిషాల్లో వైరల్‌గా మారడంతో, ప్రభాస్ అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. వెంటనే సినిమా ప్రమోషన్స్ షురూ చేయాలని, అఫీషియల్ టీజర్ లేదా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేయాలంటూ ఫ్యాన్స్ నెట్టింట ట్రెండ్ చేస్తున్నారు. ఈ అద్భుతమైన చిత్రంతో సోషల్ మీడియా సెన్సేషన్ ఇమాన్వి హీరోయిన్‌గా వెండితెరకు పరిచయమవుతుండటం విశేషం. అలాగే బాలీవుడ్ దిగ్గజ నటులు మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, సీనియర్ నటి జయప్రద, రాహుల్ రవీంద్రన్, చైత్ర జె. ఆచార్ వంటి భారీ తారాగణం ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనం సృష్టించబోతుందో చూడాలి.



## 'రౌడీ జనార్దన'లో బాలీవుడ్ భామ.. లైగర్ బ్యూటీతో మళ్లీ రౌడీ స్టార్ రొమాన్స్?

టాలీవుడ్ సెన్సేషన్ విజయ్ దేవరకొండ, క్రేజీ డైరెక్టర్ రవి కిరణ్ కోలా కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'రౌడీ జనార్దన' గురించి రోజుకో ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. పక్కా గ్రామీణ నేపథ్యంలో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని టాలీవుడ్ స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ సరసన జాతీయ అవార్డు గ్రహీత, స్టార్ హీరోయిన్ కీర్తి సురేశ్ కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు అప్పుడే ఆకాశాన్ని తాకుతున్నాయి. అయితే తాజాగా ఈ సినిమాకు సంబంధించి సోషల్ మీడియాలో ఒక క్రేజీ అప్‌డేట్ తెగ హల్‌చల్ చేస్తోంది. ఈ చిత్రంలో ఒక అదిరిపోయే మాస్ స్పెషల్ సాంగ్ ప్లాన్ చేస్తున్నారట. ఈ స్పెషల్ సాంగ్‌లో విజయ్ దేవరకొండతో కలిసి బాలీవుడ్ బ్యూటీ అనన్యా పాండే స్టెప్పులు వేయబోతున్నట్లు గట్టిగా వినిపిస్తోంది. గతంలో వీరిద్దరూ 'లైగర్' సినిమాలో కలిసి నటించిన సంగతి తెలిసిందే, ఒకవేళ ఈ వార్త నిజమైతే మరోసారి ఈ జోడి వెండితెరపై సందడి చేయడం ఖాయంగా కనిపిస్తోంది. మరి ఈ స్పెషల్ సాంగ్ ఆఫర్‌కు అనన్య గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా లేదా అనేది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే. ఇదిలా ఉంటే.. ఈ సినిమాలో వచ్చే ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్ ప్రేక్షకులకు పూనకాలు తెప్పించేలా ఉంటాయని ఇన్సైడ్ టాక్. ముఖ్యంగా ఈ ఫ్లాష్ బ్యాక్‌లో విజయ్ దేవరకొండ మునుపెన్నడూ లేని విధంగా ఫుల్ యాక్షన్ మోడ్‌లో ఊరమాస్ లుక్‌తో కనిపించబోతున్నాడట. ఇందులో వచ్చే యాక్షన్ సీక్వెన్సులు సినిమా మొత్తానికే మేజర్ హైలైట్‌గా నిలుస్తాయని చిత్ర యూనిట్ భావిస్తోంది. మరో ఆసక్తికరమైన విషయమేమిటంటే, ఈ సినిమాలో సీనియర్ యాంగ్రీ యంగ్ మ్యాన్ రాజశేఖర్ ఒక కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆయన పాత్రతో పాటు లుక్ కూడా ఇప్పటివరకు మనం చూడని రీతిలో సరికొత్తగా, ఎంతో పవర్‌ఫుల్‌గా డిజైన్ చేశారట. మొత్తానికి భారీ తారాగణం, అదిరిపోయే యాక్షన్ ఎలిమెంట్స్, విలేజ్ బ్యాక్‌డ్రాప్ స్టోరీతో తెరకెక్కుతున్న 'రౌడీ జనార్దన' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులను సృష్టిస్తుందో చూడాలి.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com